# అనుభవ రహితులు

## వల్లపు రెడ్డి

అత్త గయ్యాళి, మామ త్రాగుబోతు; ఆడబిడ్డ రంకులాడి, మరుదులు రౌడీలు, బావ జూదరి అని సామాన్యులకి మల్లే చెప్పుకోవడానికిగాని, కనీసం అనుకోవడానికి గాని అవసరం రాలేదు శారదకు. కారణం ఆమెభర్త గంగాధరంకు 'నా' అనే వాళ్ళెవరూ లేకపోవడమే ఎవరైనా ఉన్నా, ఆమె అలా చెప్పుకునేదికాదు. అతడు నగరంలో చదువుతూ ఉన్నప్పుడు ఆమెను పెళ్ళిచేసుకున్నాడు. చదువు పూర్తిచేసి, క్రొత్తగా ఆమెను కాపురానికి తీసుకొచ్చాడు.

చివరికి భర్తనడవడి 'ఇలాంటిది' అని వేలెట్టి చూపడానికిగూడా వీలులేకపోయిందామెకు. అసలామె ఇంటిగుట్టుని బజారుకెక్కించే మనిషికాదు నాయికలకుండే లక్షణాలు ఆమెకు పోల్చిచూస్తే స్వాధీనపతికలకుండే స్వభావాలు ఆమెలో గోచరిస్తాయి వీటికితోడు గంగాధరం సహజంగా మంచివాడు చదువుకున్నవాడు నలుగురిలో గౌరవం సంపాదించుకున్నవాడు అతడు చదివేరోజుల్లో వేసగి సెలవులన్నీ శ్వశుర గృహంలో గడిపేవాడు. మిత్రులతనికి ఎన్నో ఉత్తరాలు రాసేవారు వాటిని శారద చాలామార్లు చదివింది. వాళ్ళందరూ ఆయన తెలివితేటల్నీ, గుణగణాల్నీ శ్లాఘిస్తూ రాసేవారు అవన్నీ చదువుతూంటే ఆమెకే గర్వంగా ఉండేది తనభర్త ఇంతటివాడుకదా అని!

పోతే, ఆయన ఆమెపట్లకూడా ఎన్నడూ ఆవంత అవజ్ఞ కన్పరచి ఎరుగడు. ఆమెను సుఖపెట్టాలనే అహరహమూ తాపత్రయపడుతుంటాడు. ఆమె ముఖేందుబింబంలో ఆవగింజంత నలుపు కనపడినా అతడు హైరాన పడిపోతాడు ఆమె నవ్వితే అతను నవ్వుతాడు ఆమెకంటనీరుచూస్తే అతని గుండె చెరువైపోతుంది

కాపురానికి వచ్చిన మొదటినాడే ఆయన వంటమనిషిని తెచ్చాడు శారద చెయ్యి కాల్చుకోగూడదనే అభిప్రాయంతో. ఆయనకు తెలుసు; శారద పుట్టింట్లో ఎన్నడూ ఒళ్ళు వంచలేదని సుకుమారంగా, గోముతో పెరిగిన పిల్లను ఆట్టే కష్టపెటడంలో అర్థం లేదనే ఆయన వంటమనిషిని తెచ్చాడు. తనకు వంటసంగతులేమీ తెలియవని శారదకు తెలుసు. కాని, భర్త వంటమనిషిని తీసుకురావడంతో ఆమె ఆత్మాభిమానం దెబ్బతింది. తనుండగా తన భర్తకెవరో పరాయిస్త్రీ వంటచేసి పెట్టడమా? ఛీ, ఏం బాగు? తను అంత అసమర్థురాలా?—ఈ రకమైన దురభిమానంతో ఆమె ఆనాడంతా ముఖం ముడుచుకు కూర్చుంది. భర్తతో కలకలా నవ్వలేదు. ప్రొద్దుట్నుంచీ పచ్చి మంచినీళ్లయినా ముట్టుకోలేదు. వంటమనిషి తన పనిముగించి వెళ్లిపోయింది

బయటికి ఉదయమనగా పనిమీద వెళ్లిన భర్త మధ్యాహ్నం మీరింతరువాత వచ్చాడింటికి కేశాలకు తైల సంస్కారమైనా లేకండా, నిరస్తభూషయై, వాడిపోయిన ముఖపద్మంతో గదిలో ఒంటరిగా మంచంమీద కూర్చుని ఉందామె. ఆదృశ్యంచూసి ఆయన ఆపాదమస్తకం కంపించిపోయాడు ఆమెను చూసేసరికి, నాథుడు పారిజాతప్రసవాన్ని తన సవతియైన రుక్మిణీ ధమ్మిల్లంలో ముడిచినందుకుగాను ప్రణయకుపితయై కోపగృహంలో ప్రవేశించిఉన్న సత్యభామ జ్ఞాపకం వచ్చిందతనికి ఆమె సరిగా అలాంటి స్థితిలోనే ఉంటే, ఆమె పాదతాడనంతో ఆవాళ తన శిరసు వక్కలై పోకతప్పదనిపించింది. మెల్లిగా ఆమెను సమీపించి, బుజ్జగిస్తూ అడిగాడు "ఏమిటి శారదా, ఇలా ఉన్నావు?" అని

"ఏమీలేదు"—అంటూ ఆమె ముసుగుదన్ని పడుకుంది.

అతడు బలవంతంగా ఆమె కప్పుకున్న ముసుగుని గుంజివేశాడు ఆమె కన్నుల్లో నీటిని చూసి భయపడ్డాడు "ఏం జరిగింది శారదా, చెప్పు ఎవరైనా ఏమైనా అన్నారా? లేక నా మూలాన్నే అపచారం జరిగిందా? చెప్పు శారదా!" అని దీనాస్యుడై ప్రార్థించాడు, పెక్కు విధాలుగా.

ఆఖరుకు ఆమె హీనస్వరంతో అంది "వంట మనిషిని పొమ్మనండి" అని

– పారిజాతవృక్షాన్ని తెచ్చి పెరట్లో నాటడంలాంటి దుస్సాధ్యమైన పని ఏమీ చెప్పనందుకు గంగాధరం సంతోషపడ్డాడు కాని ఆమె ఎందుకు వంటమనిషిని తొలగించమంటూందో అతని కర్థం కాలా. ప్రప్రథమ దివసమే వంటమనిషిమీద శారదకు కోపం ఎందుక్కలిగిందో అతనూహించలేకపొయ్యాడు. "సరే, అలాగే చేస్తాను. కాని ఎందుకు నీకింత కోపమామెమీద?" అనడిగాడు.

"నే నుండగా ఆమె ఎందుకు? నే నే చేస్తాను మీకు వంట" అంది.

గంగాధరం ఆమె బాధని అర్థంచేసుకుని పకాలున నవ్వాడు. "బస్, ఈ మాత్రం దానికే ఇంత ఇదైపోయావా? వంటకాల్లో నీకు అనుభవంలేదని నేను మనిషిని కుదిర్చాను. అంతేకాని, నువ్వే వద్దంటే నష్టమేముందీ?" అన్నాడు. కొంచం ఆగి, "ఇంతకూ నీకు చేతనవునా అని?"—తన సందేహాన్ని ప్రకటించాడామె ముఖంలోకి చూస్తూ.

"బ్రహ్మవిద్యయిపోయింది. మీరు చూస్తారుగా" అంది గర్వంతో.

ఆమె కోరిక నెరవేర్చడం గంగాధరానికి కష్టమనిపించలేదు.

మర్రోజునించి ఆమెవంట ప్రారంభించింది. మరొకరైతే వంట మహాకష్టమైన పనని విసుక్కునేవారు. కాని తన భర్తకు మరొకరు వంటచేసి పెట్టకూడదనే భావం – మరో రూపంలో ఐతే తన అధికారాన్ని ఇతరు లెవరో తస్కరిస్తున్నారనే ఆవేదన– ఆమెకు వంటచేయడంలోని సాధకబాధకాలను లక్ష్యపెట్టే అవకాశాన్ని కలుగనీయలేదు. నిజంచెప్పాలంటే భర్తకు స్వీయహస్తాలతో ఆహారపచనం కావించిపెట్టి, ప్రధానమైన స్త్రీ ధర్మాన్ని నిర్వహిస్తున్నాననే ఆమెలోని గర్వం, తృప్తీ, ఉత్సాహమూ ఆమెకు కించిత్తు బడలికను కూడా కలిగించలేదు.

మొదటి దినం వంటకు పర్యవసానం మాత్రం ఘోరంగా పరిణమించింది. భర్త రావడంతోనే తను చేసినవంటని వడ్డించింది శారద ఆయన అన్నంముందు కూర్చుని భావగర్భితంగా నవ్వుకున్నాడు.

"ఏమండీ, ఎలా ఉంది వంట?" అని ప్రశ్నించింది

"చాలా బావుంది శారదా!"-అన్నాడు గంగాధరం. అతడు మాటల ధోరణిలోకాని, తినే విధానంలో కాని ఏమీ మార్పు రానివ్వలేదు. ఆమె అనుమానానికి తావిచ్చే చేష్ట ఒక్కటీ తనలో వ్యక్తపరచలేదు.

శారద అతని పొగడ్తని నిజమనే భావించింది. తనలో తాను సంతోషపడింది. భర్త

# ★ అనుభవరహితులు ★

భోజనం చేసి వెళ్ళాక, తీరా తను తినటానికి కూర్చున్నప్పుడుగాని తెలిసిరాలేదామెకు తన వంటకాల మాధుర్యం. అన్నం జావలా తయారైంది. పప్పులో నోట్లో పెట్టుకోతగని గాని ఉప్పు. పచ్చడిలో ఏమేమి వేసిందో జ్ఞాపకమే లేదు. ఛీ, ఏమిటీ తిండి? అనుకుంది. భర్త ఎలా తినిపోగలిగాడో తలచుకునేసరికి ఆమె బాధపడింది. ఇకముందు జాగ్రత్తగా వండాలని నిర్ణయించుకుంది. ఆనాడు సాయంత్రం టిఫినూ, రాత్రి భోజనమూ అలానే అఘోరించినై.

రెండో రోజున వంటలు మొదటిరోజుకీ పూర్తిగా భిన్నంగా తయారైనై. శారద తనవరకూను చాలా జాగ్రత్తగా వచనం చేశానని అనుకుంది. ఆనాడు కూడా గంగాధరం రుచిగానే ఉన్నాయన్నాడు. అంతటితో ఊరుకోక, "అబ్బ! శారదా, నువ్వింత సమర్థురాలివని అనుకోలేదు సుమా!" అన్నాడు.

తన పాకదక్షని ఇంకా విశాలానే కాదు కంతో ఆమె కళ్ళెత్తి అతనికేసి చూసింది, "ఎందుకూ?" అనే ప్రశ్న ద్యోతకమయ్యేట్లు.

"లేకపోతే మరేమిటి? నిన్నటి వంటకాలకిది కేవలం వ్యతిరేకం"—అన్నాడు.

గతదినం వంటలు పూర్తిగా చెడిపోయిన సంగతి ఆమెకు తెలుసు. వాటికి వ్యతిరేకం అంటే, బాగుండడమే—రుచిగా ఉండడమే—జరిగిఉండాలని అనుకుంది. కాని నానవేసిన బియ్యంలా ఉన్న అన్నాన్నీ, కూరల్లో కపాలముండలాన్నంటుతూన్న కారాన్నీ చవిచూసి అతనలా అన్నాడని ఆమె ఊహించలేకపోయింది. ఐతే తరువాత తనకే తెలిసివచ్చింది

ఎలాగైతేనేం, భర్తకు తానే వంటలు చేసి పెట్టాలని శారద ఉబలాటం; భార్య మనస్సుని నొప్పించకూడదని గంగాధరం ఉద్దేశం.—ఈ ప్రకృతుల మూలాన సత్యంగానే సాగుతూంది సంసారస్యందనం. ఏ రోజుకారోజు స్వయంగా పొందుతున్న అనుభవాల సహాయంతో శారద పరవాలేని విధంగా వంటలు చెయ్యసాగింది. ఐనా



ముకింకా పూర్వానుభవం కలుగలేదు. నూతనంగా చెయ్య ప్రయత్నించిన ప్రతి వంటా పాడే.

ఆవాళ ఆమె సాయంత్రం టిఫీను కొఱకు వడలు చెయ్యాలని ప్రొయ్యిముందు కూర్చుంది. అప్పటికి మూడయివుంటుంది సమయం. ప్రొయ్యిమీద అప్పుడప్పుడే క్రాగుతున్న నూనెలో రెండుమూడు వడల్ని చేసి విడిచింది. అవి చిరిగి చిద్రుపలై పోయినై. శారదకు తోచలేదు. నూనె మంచిది కాకపోవచ్చుననే అనుమానం కలిగింది. మినప్పిండిలో లోపం ఏమైనా ఉండొచ్చునని కూడా తోచింది. మరో రెండు విడిచింది. అవి కూడా మొదట విడిచిన వాటికి మల్లేనే విచ్చిపోయినై. అవి అలా విచ్చిపోవడానికి కారణం నూనెసలసల మరగకపోవడమే. శారదకు క్రాగుతున్న నూనెలో వడలు విడవాలని తెలుసు. కాని ఎంత మోతాదులో క్రాగిననూనెలో వడలు చెడకుండా తయారౌతాయో తెలియదు. అంచేత నూనో, మినప్పిండో మంచిది కాకపోయి ఉండాలనే అనుమానం కలిగిందామెకు. వడలలా చెడిపోవడానికి సరైన కారణమేమై ఉంటుందో అడగాలని అవతలి గదిలో కూర్చుని ఉన్న భర్త దగ్గరికి వెళ్ళిం-.

* * *

తలిదండ్రులు పరమపదించాక గంగాధరం పైతృకమైన తన ఆస్తిని ఒక నమ్మకస్థుడైన ఆసామీ పర్యవేక్షణలో ఉంచి, ఉన్నత విద్యాభ్యాసం చేశాడు. ఆ రోజుల్లోనే శారదను ఉద్వాహమయ్యాడు. విద్య పూర్తి చేశాడు. ఐతే ఆలోగా అతనిలో కలిగిన మార్పులు అన్నీ ఇన్నీ కావు. దేశంలో నిరక్షరాస్యత ద్వారా పెరిగిపోతూన్న అజ్ఞానమూ, కనీసం ప్రాథమిక విజ్ఞానమైనా లేకుండా శ్రామికులు నిరంతరం పడుతున్న పాట్లూ, సరైన చికిత్సలు చేయించుకునే దిక్కులేక రోగాలకు గురౌతున్న దీనప్రాణులూ, ధనోన్మాదులహస్తపంజరంలో చిక్కుపడి, చావు బ్రతుకుల మధ్య వ్రేలాడుతున్న బీదప్రజా జీవితాలూ అతని మనస్సుని కలచివేశాయి. కొన్నికొన్ని చోట్ల బాధాజనకమైన ఇలాంటి దృశ్యాలను ప్రత్యక్షంగా చూసినప్పుడు అతనిగుండె ద్రవించి కళ్లలోంచి అశ్రువుల రూపంలో ప్రవహించింది. ప్రపంచంలో దినదినమూ తాండవిస్తూన్న అన్యాయాన్నీ, అవినీతినీ కూకటి వ్రేళ్లతో పెరికివేయాలనుకున్నాడు. మానవసేవాదీక్షాకంకణబద్ధుడై చదువు ముగించడంతోనే, అందరిలా ఉద్యోగాలకొఱకు ప్రయత్నించకుండా నిజగ్రామానికి వచ్చి వ్యవసాయం ప్రారంభించాడు.

నిత్యజీవితావసరాల సంపూర్తికొఱకు వ్యవసాయం చేయిస్తున్నా ఆశయాన్ని మాత్రం విస్మరింపలేకపోయాడు. దేశంలోని సర్వారిష్టాలకూ మూలం అవిద్య. దాన్ని నిర్మూలిస్తే గాని దేశం స్వాస్థ్యం పొందదు. ప్రజలందరూ విద్య నేర్చుకుని, తమమట్టుకే గాక సాటిమానవులను గురించి కూడా ఆలోచించ గలిగినప్పుడు నిజంగా దేశంముందడుగు వేసినట్లు. దేశాన్ని పటిష్ఠమూ, పరిపుష్టమూ చేయడానికి చదువుకున్న యువకులే ఓం ప్రథమంగా నడుం బిగించాలి. యువకులు చేయలేని పనంటూ లేదు. ఇలాంటి బోధనలు గొప్ప గొప్ప దేశనాయకుల ఉపన్యాసాలు వినడం ద్వారానైతేనేమి, అభ్యుదయ రచయితలు వ్రాసిన నవలల ద్వారానైతేనేమి, కవుల కవితల ద్వారానైతేనేమి, అతని మస్తిష్కంలో దూరినయి. వాటిని క్రియారూపంలో ప్రదర్శించడానికి చదువుముగించిన తక్షణం పూనుకున్నాడు గంగాధరం.

ఉద్యమరూపంలో ఉండవలసిన పనిని ఏవాడూ ఒక్కడు చేయలేడు. కనుక ఊర్లోని యువకుల్ని కొందరిని సమావేశపరచి, తన అభిప్రాయాలను వెల్లడించాడు. యువకులు అతనిలా గొప్పగా చదువుకున్న వాళ్ళు కాకపోవడంవల్ల వెంటనే ఉత్సాహం చూపలేదు. అతని మాటల ప్రభావం అందరిమీదా పనిచేసింది. తలిదండ్రుల అదుపాజ్ఞలో ఉన్న కొందరు యువకులు తాము బహిరంగంగా రంగంమీదికొచ్చి కార్యాన్ని నిర్వహించలేము గాని, అతనుచేసే ప్రతి పనికీ దోహదంగా, పూసల్లో దారంలాగా మెలగుతామన్నారు. స్వతంత్రులయిన ఐదారుగురు మాత్రం సరే నన్నారు. గంగాధరం అప్పుడే తన తపస్సు ఫలించి, దేశం జాగరకమై, సస్యశ్యామలమైనట్లూ, అందరి జీవనవాటికల్లో నందనవనశోభలు అవతరించినట్లూ సంసారాల్లో స్వర్గసీమలు రూపించినట్లూ అనుభూతిని పొందాడు.

తన అభిప్రాయాలలో ఏకీభవించిన ఐదారుగురు యువకుల సహాయంతో హరిజనవాడలో ఒకటీ, తెలుగు (జాలరి) వాడలో ఒకటీ-రెండు పాఠశాలలను నెలకొల్పాడు గంగాధరం. వయోజనులకు అక్షరాభ్యాసం మొదలెట్టాడు. మొదట్లో ఎవరూ రాక పోవడం సహజమే. కాని ప్రతిదినమూ తనూ, తన అనుయాయులూ ఇంటింటికీ తిరిగి ప్రబోధంచేస్తే కొందరు రాసాగారు. వయోజనుల ఉత్సాహం రోజురోజుకూ అభివృద్ధి కాసాగింది. వాళ్ళ ఉత్సాహానికి తగిన నిష్పత్తిలోనే అతని సేవాసక్తీ పెరిగిపోసాగింది.

కొన్ని రోజులు దొర్లినై. గంగాధరం తనను గురించి గ్రామం ఏమనుకుంటున్నదీ వినడానికి తీరిక చిక్కించుకోలేదు. కాని గ్రామంలో సామాన్య ప్రజలు మాత్రం ఆయన చేస్తున్న సేవని శ్లాఘించడం ప్రారంభించారు. ఆయన అనంతమైన విజ్ఞానసంపన్నుడనీ, అనింద్యమైన వినయశీలుడనీ, అవ్యాజమైన ఔదార్యం కలవాడనీ లోకులు అనుకుంటున్నారు. వాళ్ళ మాటల్ని వినడంలో గంగాధరం శ్రద్ధ వహించకపోయినా అతనికంటే పెద్దవారూ, గ్రామంలో అధికారులుగా, పలుకుబడి కలవారుగా చలామణీ అవుతున్న వాళ్ళు మాత్రం చెవులు నిక్కించి విన్నారీ స్తుతులను. తమ కళ్ళెదుట పుట్టిన కుఱ్ఱకుంక తమను మించిపోవడం వాళ్ళకు హద్దుమీరిన ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఒకనాడు సాయంత్రం, తన ఇంటి ముందుగా వెడుతున్న గంగాధరాన్ని పిల్చాడు గ్రామాధికారి. గంగాధరం వెళ్ళాడు. ఆయన టీ వగైరా ఇచ్చి, గంగాధరంతో మాటల్లో పడ్డాడు. మాటల సందర్భంలో, "గంగాధరంగారూ, మీరు కావాలంటే ఒక గొప్ప ఉద్యోగం దొరికేది. ఎందుకనవసరంగా ఈ పల్లెటూర్కి మొరటువెధవల్లో తల బ్రద్దలు కొట్టుకుంటున్నారు?"—అన్నాడు.

"ఇంట్లో తినడానికి తగినంతగా కలిగిన నాలాంటివాళ్లుకూడా ఉద్యోగాలకు ఉవ్విళ్లూరితే, కేవలం ఉద్యోగంచేసే దృష్టితో తంటాలుపడుతూ చదివిన వాళ్ళగతి ఏంగాను?" అని గ్రామాధికారి ముఖంలోకి చూశాడు. ఆయన వరండాలోంచి కన్పడుతూన్న నీలాకాశంకేసి చూస్తున్నాడు. గంగాధరం మళ్లీ అన్నాడు: "ఇంతకూ నేను ఇక్కడ తల బ్రద్దలుచేసుకుంటున్నదికూడా ఏమీ లేదు. మొదట మొదట కొంచం కష్టంగాతోచినమాట నిజమే. కాని ఇప్పుడు అంతా సవ్యంగా జరిగిపోతూ ఉంది."

"అది నిజమేననుకోండి"- ఆకాశంనుంచి దృష్టిని గంగాధరంవైపుకుమళ్లించి అన్నాడాయన. "ఐనా, ఈ వెధవలు చదువులు వెలగబెట్టి ఏవూళ్లేలుతారండీ?"

ఆయన మాటల్లోని కాఠిన్యానికీ, నిర్లక్ష్యానికీ గంగాధరం కొంచెం బాధపడ్డాడు. ఆ బాధనేమీ వ్యక్తంకానీకుండా తనలోని-తను సాగిస్తూన్న ఉద్యమంలోని—పరమార్థాన్ని చెప్పేశాడు: "వాళ్ళు నేర్చుకుంటూన్న చదువు ఉద్యోగాలకూ, ఊళ్ళేలడానికీ పనికివస్తుందని ఎవరంటారు? ఏదో వార్తాపత్రిక చదవగలిగి, ప్రపంచ వ్యవహారాలను కొద్దిగా అర్థంచేసుకోగలిగితే చాలు. శుచీ, సభ్యతా తెలిస్తే నిత్య జీవితంలో జాగ్రత్తగా మసలుకునే అవకాశం చిక్కుతుంది."

సామాన్యులు జాగ్రత్తగా మసలుకోవడం ప్రారంభించిననాడు గ్రామాధికారులయిన తమలాంటివాళ్ల ప్రాబల్యం అడుగంటిపోతుందనే భయంతో ఆయన గంగా

# ★ అనుభవ రహితులు ★

ధరంతో ఈ సంభాషణ ఉపక్రమించాడు. గంగాధరం తనుచేస్తున్న పనిలోని ఉద్దేశం అదేనని బయటపెట్టేసరికి, ఆయన మరొక్క మాటకూడా ఆడలేదు. మౌనం వహించాడు.

"ఎటొచ్చీ, నేను పనిలేనివాణ్ణి కనుక, వాళ్లకు పనిలేని వేళల్లో నాకు తెలిసిన సంగతులు కొన్నైనా చెప్తాను"-అన్నాడు నవ్వుతూ సమస్యను తేలిగ్గా పరిష్కరించాలని.

"అలాగా! సంతోషం"—అన్నాడాయన క్లుప్తంగా.

అంతే. గంగాధరం సెలవు పుచ్చుకున్నాడు.

తరువాతి రోజుల్లో, అప్పుడప్పుడు గ్రామంలో పలుకుబడి గల ఇతర పెద్దలు కూడా గంగాధరాన్ని కలిసి, అతనుచేస్తున్న పని ఏమీ లాభకరంగా లేదనీ, ఏదైనా గౌరవప్రదమైన ఉద్యోగం చూసుకుని నిర్వహించడం కీర్తికారణమనీ చెప్పారు. గంగాధరం కూడా తనకు ఉద్యోగాపేక్షా, కీర్తికాంక్షా బొత్తిగా లేవనీ, ఏదో తనకు తోచినమట్టుకు గ్రామీణులకు అక్షరాభ్యాసం చేసి కాలాన్ని వెళ్ళబుచ్చుతాననీ అన్నాడు.

ఈ ఘటనలు జరిగిన కొద్దిరోజుల్లోనే గంగాధరం మేధకందని దృశ్యాలు గోచరించినై. వయోజనులంతా కలిసి శ్రమించి తమ బడికోసం వేసుకున్న పాక ఒకనాడు రాత్రికిరాత్రే తగులబడిపోయింది. ఊళ్ళో పెద్దలుగా తిరిగేవాళ్ల చూపులన్నీ అతనిమీద ద్వేషాన్ని బాహిరించసాగినై. వాళ్ల ప్రభావంలో ఉన్న కొందరు సన్నిహితులు కూడా అతనితో మాట్లాడ్డం మానివేశారు. ఇవన్నీ అకారణంగానే జరుగుతున్నాయని గంగాధరం ఊహ. కాని వీటికి తగినంత బలమైనకారణం నేపథ్యంలో ఉంది.

గంగాధరం పెద్దచదువు చదువుకున్నాడు. కాని ఎన్నడూ అతనిదృష్టి కీర్తివైపు పోలా. ధనార్జనకోసం మనుషులు ఎంతటి ఘోర కృత్యాలనైనా ఆచరిస్తారు. ఇది మనంనిత్యమూ చూసేది. ఐతే అంతకుమించిన ఘోర కృత్యాలు కీర్తిని ఆర్జించడంలో చేస్తారు. ఇది మనకు కన్పడదు. కాని నిదర్శనం కావాలంటే ఉంది: కీర్తికోసం ఎంతటి ధనాన్నైనా గుప్పిస్తారు మనుష్యులు. ఇంతకంటె బలమైన నిదర్శనం మరొకటిలేదు. ఈ విషయం గంగాధరానికి మరుగుపడిన సత్యం. ఎంతసేపూ అతనిదృష్టి స్నేహం, సౌహార్దం, అభ్యుదయం ఇత్యాది వాటివేపే!

హరిజనవాడలోని పాక స్వాహా అయిన తరువాత వేపచెట్టుక్రింద అరుగుమీద బడి చెప్పాడు. ఆ సమయంలో జాలరివాడలోది పెరికివేయబడింది. కొన్నాళ్ళకు చదువుకోవడానికి కూడా ఎవరూ రాలేదు. ఊళ్ళోని పెద్దలే స్వయంగా బళ్ళు తెరిచినారనీ, అక్కడికే అందరూ వెడుతున్నారనీ తెలిసింది. అక్కడ చదువు ఏం చెబుతున్నారో అతనికి తెలీదు. అతడు ఇంట్లో కూర్చున్నాడు కొన్నాళ్ళు.

గంగాధరం విచారంలో పడ్డాడు. తను తలపెట్టిన పనులన్నీ ఎందుకలా భిన్నాభిన్నమై పోతున్నాయో అతనికి అవగాహనం కాలా. గంగాధరం ఇదంతా పేరుకోసం చేశాడని మాత్రం అందరూ చెప్పుకోసాగారు. ఊరివాళ్ళు తెరిచిన బళ్ళలో ఏం బోధించారో స్పష్టపడింది.

ఆనాడు సాయంత్రం మూడుగంటలప్పుడు, ఏమీతోచక, సిగరెట్టు కాలుస్తూ గదిలో కూర్చుని జరిగిన ఘటనల నూహించుకుంటున్నాడు గంగాధరం. నోట్లోకి పీల్చుకున్న పొగని వలయాలుగా మార్చి విడువడానికి యత్నిస్తున్నాడు. కాని అతను ఆశయాల సాధనకు వేసుకున్న పథకాలకు మల్లే అవీ గాలి ఊపులకు విచ్ఛిన్నమై పోతున్నాయి.

* * *

వడలు చెడిపోతున్నాయని భర్తతో చెప్పడానికివచ్చిన శారద,భర్త వలయాలుగా విడుస్తున్న పొగల్ని చూసి, అతను కూడా తనకుమల్లేనే ప్రయత్నంలో విఫలుడౌతున్నందుకు నిర్ఘాంతపడి ఏమీ అడుగలేదు. తగినంత మోతాదుకు వేడెక్కని నూనెలో విడిచిన వడల వలెనే, వాతావరణం నిశ్చలంగా లేని గదిలో అతను విడిచే ధూమవలయాలు కూడా విచ్ఛిపోతున్నై. ★


## జమ్మివారి లివర్ క్యూర్

పసిపాపల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులకు మా ఖాతాదారుల సౌకర్యము నిమిత్తము, మా డాక్టరుగారు యీక్రింది ప్రదేశములలో ప్రతినెల నిర్ణీతమైన తేదీలలోను, గంటలలోను, తగిన సలహాలిచ్చుటకై హాజరులో నుండగలరు.

| | | |
|---|---|---|
| సలహాలిచ్చు | ఉదయం : | ... 9 నుండి 11 వరకు |
| వేళలు | సాయంత్రం : | ... 3 నుండి 5 వరకు |

| స్థలము | తేది | అడ్రసు |
|---|---|---|
| నెల్లూరు | 6 ఉదయం | అజంతా కఫే, ట్రంకురోడ్. |
| సికిందరాబాదు | 8 ఉదయం | మెసర్సు డి. జే. పరేఖ్ & కంపెని, కెమిస్టులు, జామామసీదు. |
| హైదరాబాదు | 9 ఉదయం | మెసర్సు డి. జె. పరేఖ్ & కంపెని కెమిస్టులు, రెసిడెన్సీరోడ్. |
| తెనాలి | 12 ఉదయం | కన్నికాపరమేశ్వరి సత్రం. |
| గుంటూరు | 14 ఉదయం | మెసర్సు మెడకల్ స్టోరు, కొత్తపేట. |
| మచిలీపట్నం | 16 ఉదయం | మెసర్సు ఆనంద ఫార్మసీ, కెమిస్టులు, మెయిన్ రోడ్డు. |
| రాజమండ్రి | 19 ఉదయం | మెసర్సు ఈశ్వరదాస్ & కంపెని, మెయిన్ రోడ్డు. |
| భీమవరం | 20 ఉదయం | మెసర్సు ప్రసాద్ సన్సు & కంపెని, కెమిస్టులు. |
| జంషెడ్‌పూర్ | (ప్రతినెలలో ఆఖరు ఆదివారం ఉ॥ సా॥ | ఆంధ్ర డ్రమెటిక్ & లిటరరీ సొసైటీ, సాక్చి. |
| ఖరగ్‌పూరు | 4 ఉదయం: సాయంత్రం: | మెసర్సు యునైటెడ్ మెడికల్ స్టోర్సు, కెమిస్ట్సు & డ్రగిస్ట్సు: ఎస్. టి. ఇ. 155, రైల్వే మార్కెటు. |

జమ్మి వెంకటరమణయ్య & సన్సు.

బ్రాంచీలు :

* గుండా కృష్ణమూర్తి బిల్డింగ్ : 17/329, నాగేశ్వరరావు పంతులు రోడ్, గాంధీనగర్ P. O., విజయవాడ-2.

* ఓరుగంటివారి వీధి, విజయనగరం సిటీ, * 132/1, హారిసన్‌రోడ్, కలకత్తా.